

ధర్మారంలోని క్రీడా ప్రాంగణం


ఇటీవల గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు

# ధర్మారం ధగధగ

- ప్రగతి పథాన గ్రామం
- మారిన రూపురేఖలు
- మౌలికవసతుల కల్పన
- కోటి 63.5 లక్షలతో అభివృద్ధి పనులు
- రూ. 40 లక్షలతో సీసీ రోడ్లు
- రూ. 10 లక్షలతో డ్రైనేజీలు
- పాఠశాలలో రూ. 32 లక్షలతో పనులు


ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న ప్రహరీ

లక్ష్మణచాంద, అక్టోబర్ 18 : ప్రభుత్వం గ్రామాలాభివద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నది. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో గ్రామాల రూపురేఖలే మారుతున్నాయి. 20 సంవత్సరాల కాలంలో జరగని అభివృద్ధి పనూలు ఈ నాలున్నర సంవత్సరాల కాలంలో జరిగాయి. ధర్మారం గ్రామం ప్రగతి పథంలో పరుగులు పెడుతున్నది. ప్రభుత్వం రూ. కోటి 63.5 లక్షలతో అభివృద్ధి చేయడానికి నిధులను అందించింది. వెయ్యి జనాభాతో 700 ఓటర్లు గల ఈ గ్రామం ప్రభుత్వం అందిస్తున్న నిధులతో అద్భుతమైన ప్రగతిని సాధించింది. రూ.40 లక్షలతో ప్రతీ వీధిలో సీసీ రోడ్డు నిర్మించారు. అలాగే సీసీ రోడ్లకు ఇరువైపులా రూ. 10 లక్షలతో డ్రైనేజీలు నిర్మించారు. రూ. 12 లక్షలతో శ్మశాన వాటిక నిర్మించారు. దీంతో ప్రజల అవస్థలు తీరాయి. గ్రామంలో చెత్త సేకరణకు ప్రత్యేక ట్రాక్టర్ ఏర్పాటు చేయడంతో ప్రతి రోజూ గ్రామంలోని చెత్తను తరలిస్తున్నారు. గ్రామం శుభ్రంగా కనిపిస్తున్నది. రూ. 2.5 లక్షలతో సెగ్రిగేషన్ షెడ్డు ఏర్పాటు చేశారు. చెత్తా చెదారంతో ఎరువులను తయారు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ. 12 లక్షల మంజూరు చేసింది. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 14 లక్షలు, మన ఊరు–మనబడి కింద, పాఠశాల అవసరాల కోసం మరో 10.5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే మరో పదిలక్షలు పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు చేసింది. దాంతో పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.

### ప్రత్యేక నిధులతో షాపింగ్ కాంప్లెక్స్

రూ. 10 లక్షల ప్రత్యేక గ్రాంటు మంజూరు చేయడంతో పోచమ్మ ఆలయ సమీపంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే ధర్మారం గ్రామానికి ప్రతినిత్యం వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా మారనుంది. గ్రామంలోని హనుమాన్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల నిధులను అందజేయడంతో ఆలయం ఎంతో సుందరంగా నిర్మించారు.

### ఇంత అభివృద్ధిని ఎప్పుడూ చూడలేదు..



నాకు తెలిసి 30 నుంచి 40 సంవత్సరాల కాలం నుంచి ధర్మారం గ్రామాన్ని చూస్తున్నాను. గత నాలుగున్నర ఏళ్లలో జరిగిన అభివృద్ధిని 40 సంవత్సరాల్లో జరుగలేదు. గ్రామానికి ఏయే అవసరాలు ఉన్నాయో గుర్తించి, వాటిని తీర్చడానికి అవసరమైన అన్ని నిధులను ప్రభుత్వం అందించింది. గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతున్నది. మండలంలో వెనుకబడిన గ్రామంగా ఉండే ధర్మారం గ్రామం నేడు ఆదర్శగ్రామంలా తయారైంది.

**- వై లింగారెడ్డి, ధర్మారం**

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం..



మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సహకారంతోనే గ్రామం ఇంత వేగంగా అభివృద్ధి సాధించింది. ఎన్ని నిధులు అడిగితే అన్ని నిధులను మంత్రి మంజూరు చేశారు. ధర్మారం పోచమ్మ ఆలయం అభివృద్ధి పనులు వేగంగా చేపట్టారు. ఇందుకు మంత్రి అందించిన సహకారమే కారణం. మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి, సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. సర్కారు పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నది. అనేక గ్రామాలు ప్రగతి పథంలో దూసుకెళ్తున్నాయి.

**- కుర్మ రాజేందర్ రెడ్డి, సర్పంచ్(ధర్మారం)**


జలాభిషేకానికి తరలివచ్చిన గ్రామస్తులు

## గ్రామదేవతలకు జలాభిషేకం

నర్సాపూర్(జీ), అక్టోబర్ 18 : ఆయా గ్రామాల్లో దుర్గా శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కుంకుమార్చన, పూలాభిషేకం, పాలాభిషేకం నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని కుర్మ వాడకు చెందిన దుర్గామాత భక్తులు బుధవారం గ్రామదేవతల వద్దకు శోభాయాత్రగా వెళ్లి జలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుర్గామాత మండపానికి వెళ్లి పూజలు చేశారు. యుగేందర్ పండితులు మహేందర్, గోపిడి గంగారెడ్డి, గిరిధర్, నరేందర్, నగధర్, పాల్గొన్నారు.

## సకాలంలో బిల్లులు చెల్లించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

దిలావర్‌పూర్, అక్టోబర్ 18 : విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి నాణ్యమైన విద్యుత్‌ను పొందాలని ఆ శాఖ ఏడీఈ రమేశ్ సూచించారు. బుధవారం దిలావర్‌పూర్ గ్రామంలో ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లింపుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత అవసరాలకోసం, ఇతర పరిశ్రమ ల కోసం విద్యుత్‌ను వినియోగించే వారు విధిగా ఇంటి నుంచే బిల్లులు చెల్లించే అవకాశాన్ని తమ సంస్థ కల్పిస్తుందని దీనిని ప్రజలు వినియో గించుకోవాలని సూచించారు. ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్‌లు సంతోష్‌పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

కుభీర్, అక్టోబర్ 18 : మండలకేంద్రంతో పాటు పార్డి(కే) తదితర గ్రామాల్లో శరన్నవ రాత్రోత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహి స్తున్నారు. మండపాల్లో ప్రతి రోజూ రాత్రిళ్లు భజనలు నిర్వహిస్తున్నారు. పార్డి(కె)లో రేణుకా ఎల్లమ్మ నాటక ప్రదర్శన కొనసాగుతున్నది.


కుభీర్ : పార్డి(కే)లో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు


## అమ్మవారి దర్శనానికి భక్తుల పాదయాత్ర


నందిగుండం దుర్గామాత గుడికి బయలు దేరిన భక్తులు

లక్ష్మణచాంద, అక్టోబర్,18: మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన దుర్గామాత భక్తులు బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత అమ్మ వారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లారు. 12 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. అంతకు ముందు నర్సాపూర్‌లోని దుర్గామాత మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మాల దారణ భక్తులు మహిపాల్, అశోక్, శ్రీకాంత్, మాతా స్వాములు పాల్గొన్నారు.

## లక్ష జప యజ్ఞాన్ని జయప్రదం చేయండి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18 :నిర్మల్‌లోని బంగల్‌పేట్ శివారులోని రాధ శ్యామల పీఠం మహాదేవ్ శక్తి సంస్థాన్‌లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగ రంగ వైభవంగా సాగుతున్నాయి. అష్టాదశ శక్తి పీఠ అమ్మవార్ల వద్ద ఈనెల 21న శనివారం రాత్రి 6.45 నిమిషాలకు దుర్గా భవానీ స్వాములతో చండీ నవర్నావ మంత్ర లక్ష జప యజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు శివరాజయోగి కృష్ణ స్వామిజీ తెలిపారు. దీంతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని, రాష్ట్రం లో ఎక్కడా లేని విధంగా అష్టాదశ శక్తి పీఠాలకు నిత్యం పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


పూజలు చేస్తున్న కృష్ణా రెడ్డి

### భగత్‌సింగ్ జయంతి

నిర్మల్ టౌన్, అక్టోబర్ 18 : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ భగత్‌సింగ్ 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ పోరాటం అతివాద పోరాటమని పేర్కొన్నారు. నాయకులు విలాస్, రమేశ్, శంకర్, అనంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

### రోగులకు పండ్ల పంపిణీ

భైంసా, అక్టోబర్ 18 : భైంసాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వవిప్ బాల్కసుమన్ జన్మదినం సందర్భంగా బుధవారం రోగులకు పండ్లను పంపిణీ చేశారు. విజయ్, భీంరావు, సాహెబ్ రావు, వాడేకర్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

### వైస్ చైర్మన్‌కు ఘన సన్మానం

సోన్, అక్టోబర్ 18 : మంజులాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఉపాధ్యక్షులుగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన బర్మ గంగదాస్‌ను బుధవారం కడ్తాల్ గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యుల సన్మానించారు. బర్మ గంగదాస్‌ను గుర్రం నారాయణ, గుర్రం భీమన్న, రవి, రాము, నర్సయ్య, చిన్న భీమన్న, భూమన్న, గంగన్న, తదితరులు పూలమాల, శాలువాలతో సన్మానించారు.